

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు.. ఇప్పుడు ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తోంది. మార్చిలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా.. శాసనసభలో బలాబలాల దృష్ట్యా కాంగ్రెస్ కూటమికి నాలుగు.. బీఆర్ఎస్‌కు ఒకటి దక్కే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి పలువురు ముఖ్యనేతలు మండలిలో అడుగు పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ఎమ్మెల్సీ దంగల్‌లో ఆయా పార్టీల నుంచి ఎవరికి ఆ ఛాన్స్ దక్కుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే నేతల అధిపత్య పోరుతో అట్టుడుకుతున్న ఓరుగల్లు కాంగ్రెస్‌లో... ఎమ్మెల్సీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలు ఒకరికి రాకుండా మరొకరు చెక్ పెట్టుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో తొలుత మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిరా, మామిండ్ల ఝాన్సీరెడ్డి పేర్లు కాంగ్రెస్ వర్గాల్లో వినిపించాయి. కానీ ఆ తర్వాత అనూహ్యంగా వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య పేర్లు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. ఇక బీఆర్ఎస్‌కు దక్కే ఒకే ఒక సీటు కోసం మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోందని సమాచారం. ఆయా పార్టీల నుంచి నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారుండగా.. ఇటు కుల సమీకరణలు.. అటు రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుని అధినాయకత్వాలు ఎవరికి అవకాశమి స్తాయోనన్న ఉత్కంఠ సర్వత్రా కనిపిస్తోంది.



ఎమ్మెల్సీ దంగల్!

ఎమ్మెల్యే కోటా సీటుపై కన్నేసిన ఓరుగల్లు నేతలు

- కులాల సమీకరణలో మండలిలో అడుగు పెట్టేదెవరో?
- అధికార కాంగ్రెస్‌లోని ముఖ్యుల మధ్య పోటా పోటీ
- ముమ్మర ప్రయత్నాల్లో కొండా మురళి, కొమ్మూరి, ఝాన్సీరెడ్డి, ఇందిర
- అనూహ్యంగా తెరపైకి వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి పేర్లు
- సాంబయ్య పేరును సూచిస్తూ పలువురు ఎమ్మెల్యేల లేఖలు
- బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతికి అవకాశం?
- ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తున్న పెద్దల సీటు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఓ కాంగ్రెస్ నేతకు సీటు దక్కుతుందనే చర్చ ఆపార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఆ ఒక్కరు ఎవరు అనే ఉత్కంఠ కేడర్‌లో నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో ఓడిపోయిన నేతలు ప్రయత్నాలతో పాటు అనూహ్యంగా కొత్త పేర్లు తెరపైకి రావటంతో కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ సీటు హాట్ హాట్‌గా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి మండలిలో అవకాశం లభిస్తుందనే చర్చ జరుగుతుండగా.. మొదటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న వేం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా తీసుకుని, మంత్రి మండలిలో చోటు కల్పిస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మరొకరికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఇందుకు వేం పేరును పరిశీలిస్తున్నారని సమాచారం. ఇప్పటికే ఎస్సీ, బీసీల నుంచి ఇద్దరు మంత్రులు ఉండగా, ఓసీ సామాజిక వర్గం నుంచి నరేందర్‌రెడ్డిని తీసుకునేందుకు ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వొచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఇక సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్య పేరు కూడా ఎమ్మెల్సీ ఆశావాహుల జాబితాలో చేరింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురైదుగురు ఎమ్మెల్యేలు ఇటీవల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలో అప్పటి ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసి దొమ్మాటికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొత్తగా వేం నరేందర్‌రెడ్డి, సాంబయ్య పేర్లు తెరపైకి రావటంతో ఏడాదికాలంగా ఎమ్మెల్సీ సీటుపై కన్నేసిన నేతలు మరింత సీరియస్‌గా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీకి గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ సీటుపై హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేం నరేందర్‌రెడ్డికి సీటు ఇస్తే కొండాకు అనుమానమేనన్న చర్చ ఉంది. దీంతో మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఏఐసీసీలో కీలకమైన నేతలతో సురేఖ ఇటీవల ఢిల్లీ పర్యటనలో మురళీ ఎమ్మెల్సీ సీటుపై గతంలో అధిష్ఠానం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. ఇక పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సైతం ఎమ్మెల్సీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఓసీ కోటా నుంచి భారీగా క్యూ ఉండటంతో తనకు ఎమ్మెల్సీ సీటు కాదంటే జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో పాటు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని ఝాన్సీరెడ్డి అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిర పేర్లు కూడా ఎమ్మెల్సీ సీటు ఫైట్‌లో వినిపిస్తున్నాయి.

కులాల సమీకరణలు.. ఆధిపత్య పోరు..

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరుకు తోడు రాష్ట్ర కాంగ్రెస్‌లో కులాల సమీకరణలతో ఎవరికి ఎమ్మెల్సీ సీటు దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీకి ఎమ్మెల్సీ సీటు దక్కకుండా కాంగ్రెస్‌లోని ఓ వర్గం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే కొత్త పేర్లను తెరపైకి తీసుకొచ్చారనే చర్చ ఉంది. ఇది గమనించే మంత్రి కొండా సురేఖ

మిగతా 7వ పేజీలో...



ఎయిర్‌పోర్టుకు.. రైట్ రైట్

ఏఏఐకి కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ లేఖ

- అనుమతుల రాకతో ఇక వేగంగా వరంగల్ విమానాశ్రయ పనులు
- ఇప్పటికే భూసేకరణకు రూ.205కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- 253 ఎకరాల సేకరణకు రైతులతో ప్రభుత్వం చర్చలు
- 150కి.మీల నిబంధన సడలింపుపై ఎన్‌వోసీ ఇచ్చిన హెచ్ఐఏఎల్
- కేంద్ర ప్రభుత్వం వద్ద ఫలించిన రాష్ట్ర సర్కారు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానశ్రాయానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర విమానాయమంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్‌కుమార్ ఝా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చైర్మన్‌కు శుక్రవారం లేఖ పంపడం, ఎయిర్‌పోర్టుకు ఉన్న ప్రధాన అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలిగిపోతుండటంతో ఓరుగల్లులో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే 253 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు విడుదల చేసింది. 150కి.మీల నిబంధన సడలింపుపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటేడ్ (హెచ్ఐఏఎల్) నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ సానుకూల అంశాల నేపథ్యంలో ఇక వరంగల్‌లో విమానం ఎగరటం పక్కా అనే చర్చ జరుగుతోంది.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు సై

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్(ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే

మిగతా 6వ పేజీలో...







వరంగల్ నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను ప్రారంభిస్తున్న బ్రహ్మానందం, నిట్ అధికారులు

జీవితం ఒక ఆట.. ఆడుతూనే ఉండాలి..

- చదువుకు పేదరికం అడ్డుకారాదు
- గొప్పవాళ్లంతా పేదరికాన్ని జయించినవారే
- మంచి ఆలోచనలు.. పనుల్లోనే దేవుడున్నాడు
- ప్రముఖ సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం
- వరంగల్ నిట్ విద్యార్థులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం
- జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్ స్ప్రీకి శ్రీకారం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

7

ఇంటర్ ఎగ్జామ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రశ్నపత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలి
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు



సీఎస్‌తో వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయని, వాటి నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తి, ప్రశ్నాపత్రాలు జిల్లాలకు చేరుకున్నాయని చెప్పారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్ష కేంద్రాలకు పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్నాపత్రాలు పంపించాలని సూచించారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాలను పోస్టల్ ద్వారా పంపించేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, సమీపంలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని చెప్పారు. ఎల్ఆర్ఎస్ -2020 కింద 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, 2024 సెప్టెంబరులో జారీ చేసినమార్గదర్శకాల ప్రకారం.. కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందన్నారు. ఎల్ఆర్ఎస్‌ను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. మహబూబాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్‌లు లెనిన్‌వత్సల్‌టొప్పో, కె.వీరబ్రహ్మచారి, ఆర్డీవో గణేష్, అధికారులు మదార్, హరిప్రసాద్, రవీందర్‌రెడ్డి, రవీందర్, శాంతికుమారి, ఉదయ్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షా కాలం!

భయం వదులుకో.. విజయం నీదనుకో!!



- ఎగ్జామ్స్ సమయంలో పిల్లలకు పేరెంట్సే ధైర్యం
- మనోనిబ్బరం పెంచాల్సింది గురువులే
- నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్స్ ప్రారంభం
- ఈ నెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు షురూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇదీ.. పరీక్షల మాసం.. మార్చి అంటే ఆర్థిక సంవత్సరం ముగింపు పలికే నెల కూడ.. ఇదే విద్యార్థుల ప్రతిభను చాటుకునే పరీక్షామాసం.. మార్చి వస్తుందంటే చాలు విద్యార్థుల్లో గుబులు.. కొంచెం అటు..ఇటుగా వివిధ పరీక్షలు ఫిబ్రవరి మధ్యస్తం నుంచే ఆరంభమై మార్చి, ఏప్రిల్ వరకు కొనసాగుతాయి. మార్చి 1వ తేదీ నుంచి డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు 5వ సెమిస్టర్, 7 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 3వ సెమిస్టర్, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 1వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్, మార్చి 21 నుంచి పదో తరగతి విద్యార్థులకు, ఏప్రిల్ 1 నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఎగ్జామ్స్ అంటే భయాన్ని వీడితే.. జయం మనదేననీ.. మనోనిబ్బరాన్ని పెంచుకోవాలి. రాత్రింబవళ్లు తెగ చదువాలన్న ఆత్రుతతో నిద్రకు దూరం కావడం, అతి సమయం మేల్కొని ఉండటం, సరియైన ప్రణాళిక, తగిన ఆహార నియమాలు పాటించకుండా పోతే అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. చదివి అవగాహన చేసుకోవాల్సిన అంశాలను స్పష్టంగా రాస్తే మంచిఫలితాలు తప్పకుండా వస్తాయి.

ఇక.. సోషల్ మీడియాకు దూరం..

సహజంగా నిద్ర ఎవ్వరికైనా.. మెడిసిన్ లాంటిది. నిర్ణీత కాలంలో నిద్రపోవడం వల్ల మనస్సుకు ప్రశాంతతా లభిస్తోంది. అరచేతిలో ప్రపంచాన్ని చూపుతున్న విజ్ఞానం మరోకోణంలో నిద్రకు దూరం చేస్తుంది. అదే సోషల్ మీడియా ఈ రోజుల్లో విద్యార్థులను అన్నింటికి ఇబ్బందులకు గురి చేస్తోంది. మీడియాకు అడెక్ట్ కావడం ద్వారా ఫేస్‌బుక్, వాట్సాప్, మెయిల్ చెకింగ్ వంటి వాటికి అలువాటు పడుతున్నారు. దీంతో తెలియకుండా నిద్ర కుభంగం కలుగుతోంది. ఎక్కువ సమయం కంప్యూటర్, సెల్‌కు అత్తుకుపోవడం వల్ల ఇతరాంశాలపై దృష్టిసారించలేకపోతున్నారు. పరీక్ష సమయానికి ముందునుంచే సోషల్‌మీడియాకు దూరంగా ఉండటం మంచిదని సైకాలజీస్టులు సూచిస్తున్నారు.

ఒత్తిడి.. అధిగమించండిలా..

పరీక్షల ఒత్తిడి లక్షణాలు ఒక్కొక్కరికీ ఒక్కొక్కరకంగా ఉంటాయి. తలనొప్పి, ఆహారం జీర్ణంకాకపోవడం, వాంతి అయ్యేలా అన్పించడం, ఎక్కువగా తినేయడం, నిద్రలేమి, ఆలసట, ఆసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవడం, తరచుగా మూడు మారిపోతుండడం ఇవన్నీ పరీక్షల్లో ఒత్తిడిని సూచించే లక్షణాలని సైకాలజిస్టులు చెబుతున్నారు. నిజానికి పరీక్షలు సమర్థవంతంగా రాసే శక్తిఉన్నా.. ఎగ్జామ్స్‌కు ముందు చదివింది గుర్తుకు ఉండడం లేదన్న భయం సమర్థులను కూడా నిర్వీర్యం చేస్తుంది. పాఠ్యాంశం అర్థం చేసుకుని సబ్జెక్ట్ మీద ఇష్టం, ఆసక్తితో చదవడం ద్వారా మరిచిపోవడం జరగదు. ఇష్టమైన సినిమాలో కొన్ని సన్నివేశాలు ఎలా గుర్తుపెట్టుకోగలుగుతున్నామో అదే కోణంలో చదువుపై శ్రద్ధ, ఆసక్తి పెంపొందించుకుంటే ఖచ్చితంగా విజయం తథ్యం.

ఆత్మవిశ్వాసంతో పరీక్షా కేంద్రంలోకి..

విద్యార్థులు పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్ష కేంద్రంలోకి అడుగు పెట్టాలి. భయం, ఒత్తిడితో సమయం వృధా చేయొద్దు. తొలుత

మిగతా 8వ పేజీలో...

ఘనంగా సైన్స్ డే



సూధవపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

- సీవీ రామన్ చిత్రపటాలకు నివాళి
- పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిట్‌ల ప్రదర్శన
- విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా స్కూళ్లల్లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించగా, ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కురవి మండలం నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలో మండల విద్యాధికారి బాలోజీనాయక్ పాల్గొని మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని సైన్స్‌పై అవగాహన పెంచుకుని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై పట్టు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు సాయిలు, మాంజీ, సుధాకర్, గంగాధర్, కరుణ, మాధవాచారి, శంకర్, కిష్టు, అజ్మత్‌ఉన్నీసాబేగం, ప్రకాష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. కురవి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన వేడుకలో హెచ్ఎం వహీద్, ఉపాధ్యాయులు ముత్యాల శ్రీధర్, విజయ్ రాజ్, ధైద వెంకటేశ్వర్లు, విజయలక్ష్మీ, పగడాల లక్ష్మయ్య, నర్సింహచారి, బొందిలి వెంకన్న, బండి రవీందర్, మల్లిఖార్జున్, ప్రేమ్‌సాగర్, బాలాజీ, యాకమ్మ, శ్యామలాదేవి, పద్మలత, రత్నకుమారి, కళావతి పాల్గొన్నారు. సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలో హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, అంజద్‌పాష, సారంగం, సరోజ, శుభ, ప్రగతి, బాలరాజు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మహర్షి విద్యాలయంలో నిర్వహించిన వేడుకలో కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గిరిజ, సునిత, శ్వేత, శ్రీవాణి, విజయ్‌కుమార్, మహేశ్వరీ, విజయలక్ష్మీ, రమాదేవి, రమేష్, పద్మావతి, రజియా, కౌసల్య, సంజీవ, వీణ, రంజాన్ అలీ, మంజుల, జ్యోత్స్న పాల్గొన్నారు. మహబూబాబాద్ మండలం మాధవాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగిజబిట్ల ప్రదర్శనను మాల్యాల కృషి విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త ప్రశాంత్ ప్రారంభించారు.

ఈ వేడుకలో ప్రధానోపాధ్యాయుడు సంకా బద్రినారాయణ, ఉపాధ్యాయులు స్నేహలత, బాబురెడ్డి, నాగయ్య, రమాదేవి, పరమాత్మాచారి, సుజాత, సౌభాగ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎం పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తొర్రూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టీజీ ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ డిపో పరిధిలో 10 ఏళ్లలో 130 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారని, అప్పటి నుంచి ప్రభుత్వం పీఆర్సీ, ఈఏలు, గ్రాటివిటీ, ఏరియర్స్ తదితర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఉద్యోగికి రూ.2లక్షల వరకు బకాయిలు రావాలని, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.వెంకన్న, కార్యదర్శిగా రాంచంద్రయ్య, కోశాధికారిగా కె.వి.స్వామి, మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజు, చంద్రయ్య, వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి జరిమానా



కేసముద్రంలో బైండోవర్ ఉల్లంఘన కేసులో జరిమానా రశీదులను అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ భిక్షపతి

కేసముద్రం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి రూ.50వేల చొప్పున కేసముద్రం తహసీల్దార్ దామోదర్ జరిమానా విధించినట్లు గూడూరు ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ గిర్నితండాకు చెందిన బానోత్ పద్మ, అమినాపురానికి చెందిన అంగోతు జ్యోతి ఇరువురిని గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ కొద్దినెలల క్రితం మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.50వేలచొప్పున ఇరువురికి జరిమానా విధించారు. ఈ డబ్బులను బైండోవర్ అయిన వారు చలాన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించగా రశీదులను ఎక్సైజ్ సీఐ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శీలంరాజేశ్వరి, హెచ్‌సీ బుచ్చయ్య, ఎక్సైజ్ పీసీలు సుధాకర్, యుగంధర్, నరేష్, వెంకన్న, బాలకృష్ణ, దేవేందర్, కిషోర్, గద్దర్, సాయిరాం పాల్గొన్నారు.

సద్గురు సంత్ సేవాలాల్ మార్గం సేవా మార్గమే

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- జయంత్యుత్సవాల్లో మంత్రి సీతక్క



తలపాగా ధరిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ మార్గం సేవా మార్గమేనని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. ములుగు జిల్లాకేంద్రంలో శుక్రవారం జరిగిన సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ములుగు జిల్లాకేంద్రంలో సంత్ సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి స్థలంతోపాటు నిధులు మంజూరు చేయించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. కమ్యూనిటీ హాల్‌తో పాటు అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనాభివృద్ధి కోసం వరాలు కురిపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు రూ.2కోట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. సేవాలాల్ ఎంచుకున్న భక్తి, విశ్వాసం, నమ్మకంతో వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పని



సేవాలాల్ మహారాజ్ పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దివాకర

చేయాలని, రేపటి తరానికి సేవాలాల్ సేవలు అందించాలన్నారు. చరిత్ర లేనిదే వర్తమానం లేదని, చరిత్ర పునాదుల మీదే మన జాతి నిర్మితమవుతుందని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించడమే ఆయనకిచ్చే నివాళి అన్నారు. గతంలో సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రూ.17వేల కోట్లను ఎస్టీ సంక్షేమం కోసం కేటాయించిందని ఆమె పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో బంజారాలు నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారా జాతి అభివృద్ధికి, వారి అభ్యున్నతికి 22 సూత్రాలను అందించారని అన్నారు. సామాజికంగా బంజారాలు ఎదగాలని, సేవాలాల్ మహారాజ్ చెప్పిన విధంగా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, బంజారాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అడవిలోని బాటలో పులి పాదముద్ర

ప్రతాపగిరి అడవుల్లో పెద్దపులి సంచారం!

కాటారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మళ్లీ పెద్దపులి సంచారం అధికారులు, ప్రజల్లో కలకలం రేపుతోంది. పెద్దపులి మహదేవపూర్ మండలంలోని ఏన్కపల్లి అడవుల నుంచి ప్రతాపగిరి అడవుల వైపు వచ్చినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. శుక్రవారం అడవుల్లో పెద్దపులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించగా పులి జాడ కోసం కాటారం ఎఫ్ఆర్వో స్వాతి, కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ నేతృత్వంలో అటవీఅధికారులు సిబ్బంది అడవులను జల్లెడ పట్టారు. పులి సంచారానికి సంబంధించి పలు చోట్ల పాదముద్రలు(పగ్ మార్క్స్) కనిపించాయి. దీంతో ప్రతాపగిరి అడవుల చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా, గత 18 రోజులుగా పెద్దపులి శాశ్వత ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికే మహదేవపూర్ డివిజన్ అడవులను కలియతిరుగుతున్నదని పలువురు అనుమానాలు వెలిబుచ్చుతున్నారు.

బొడ్లాడలో వృద్ధుడి ఆత్మహత్య

దంతాలపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్లాడకు చెందిన మేకల మల్లయ్య (50) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఘర్షణ పడి తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. మల్లయ్య ఇంటి ఆవరణలో ఓ వ్యక్తి పెంపుడు కుక్క చనిపోయిన కోళ్లను గురువారం రాత్రి తీసుకొస్తుండగా కుక్కను కట్టేసుకోమని సదరు వ్యక్తికి మల్లయ్య చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం మనస్తాపంతో శుక్రవారం ఉదయం ఇంటికి సమీపాన చర్చి ఎదుట చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్‌కు మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులే

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్, ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్స్‌లో శుక్రవారం మూడు రోజుల పాటు కొనసాగనున్న డీఎస్సీ-2024లో నియామకమైన ఉపాధ్యాయులకు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా నేర్చుకొని, పాఠశాలలోబోధన చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు బడుగు, బలహీన వర్గాల పిల్లలే వస్తుంటారని, వారికి విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణకుసమయపాలన పాటిస్తూ రిసోర్స్‌పర్సన్లు చెప్పే అంశాలను నేర్చుకొని విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. శిక్షణలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఆర్పీలు ప్రవీణ్‌కుమార్, నాగముని, రమేష్, వీరన్న, ఓంకార్, యాదగిరి, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, సారంగం, సీఆర్పీలు రజని, లింగమూర్తి, ఉప్పలయ్య, అరుణ పాల్గొన్నారు.



రామప్పలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పూజారులు, భక్తులు



ఆలయంలోని శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

7వ తేదీ నుంచి పలు రైళ్లు రద్దు

డోర్నకల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీ నుంచి 13 వరకు గోల్కొండ, కాకతీయ, సింగరేణి, ప్యాసింజర్ రైళ్లను, ఇంటర్‌సిటీ, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ 9న, బిలాస్‌పూర్‌నుంచి తిరుపతివెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దుచేసినట్లు వెల్లడించింది.

అలాగే మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మూడోలైన్ నిర్మాణం, విద్యుదీకరణ కారణంగా 9 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ వైపు వెళ్లే మణుగూరు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్, గౌతమి ఎక్స్‌ప్రెస్, సింహపురి ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం - సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, కృష్ణా ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్- నాగర్‌సోల్, చెన్నై ఎక్స్‌ప్రెస్, అండమాన్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, లక్నో ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లను మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ రైళ్లన్నింటికీ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 12, 13 తేదీల్లో విజయవాడ వైపు వెళ్లే మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉన్న ప్రతీ రైలును డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

రామప్పలో.. అగ్నిగుండాలు

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

వెంకటాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రామప్పలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఉత్సవాలు పూర్తయ్యాయి. అద్భుత శిల్పకళకు నిదర్శనమైన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయంలో ఉత్సవాలు ముగిసినప్పటికీ భక్తుల తాకిడి పెరిగిపోతోంది. అత్యంత శిల్ప కళాశాల సౌందర్యమైన రామప్ప దేవాలయాన్ని కనులారా వీక్షించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని భక్తులు తిరుగు ప్రయాణం అవుతున్నారు. మూడురోజుల పాటు ఆలయ పరిసర ప్రాంతాలు దేదీప్యమైన విద్యుత్ దీపాల మధ్య అత్యంత శోభితంగా వెలిగి పోయాయి. అంతేకాకుండా భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా రామప్ప రామలింగేశ్వరుడు మూడు రోజుల పాటు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చాడు. వీరికి ఆలయ అర్చకులు రామలింగేశ్వరుడి నిత్య పూజలు, అర్చనలుచేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

రామప్పలో చివరి ఘట్టమైన అగ్నిగుండాల మహోత్సవం ఆలయ ఇన్‌స్పెక్టర్ కవిత, కార్యనిర్వహణాధికారి బిల్ల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారులతో పాటు భక్తులు ప్రవేశం చేసి వారి భక్తిని చాటుకున్నారు. పూజారులు సాయంత్రం 6 గంటల నుంచి గణపతి పూజ, వీరభద్ర పూజలు నిర్వహించిన అనంతరం తెల్లవారుజామున 4 గంటలకు అగ్నిగుండ ప్రజ్వలన, పూజారులు అగ్నిగుండ ప్రవేశం తర్వాత గెలుపు నాగబలి నిర్వహించి భక్తు లకు తీర్థప్రసాదాలు అందజేసి ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య



బ్రాహ్మణపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సూర్య

మంగపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి ఇసుక రీచ్‌ల వద్ద కొందరు స్థానిక నేతలు సోషల్ మీడియా పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు కార్యకర్తల నుంచి సమాచారం అందిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం, రాజుపేట,రమణక్కపేట, వాడగూడెం, పాలాయిగూడెం, చుంచుపల్లి ఇసుక రిచ్‌లు ఉన్న గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పలుచోట్ల సూర్య మాట్లాడుతూ ఇసుక వసూళ్ల పర్వంపై తాను పూర్తిగా ఆరా తీస్తున్నానని తెలిపారు. డబ్బు కోసం పార్టీ పేరుతో మంత్రి సీతక్క, తన పేరును కొందరు వాడుకొంటూ లబ్ధిపొందుతున్నారని తెలిసిందన్నారు. గ్రామాల అభివృద్ధికి దోహదపడే ఇసుక క్వారీల నుంచి లబ్ధిపొందాలని కొంతమంది స్థానిక నేతల స్వార్థ పూరిత వసూళ్లపై తాను ఆరా తీశానన్నారు. క్వారీల వద్ద అవకతవకలు జరుగకుండా కాంట్రాక్టర్లు, సొసైటీల సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అక్రమాలు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని సూర్య ప్రజలకు సూచించారు. సూర్య వెంట యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఎయిర్‌పోర్టుకు.. రైట్ రైట్!

(5వ పేజీ తరువాయి)

సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్ నెలలో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతావరణం అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమారు రెండు వారాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూరులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇటీవలే ఈ సర్వేల రిజల్టు కూడా ఏఏఐ విడుదల చేసింది. వరంగల్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపేందుకు అనుకూలంగా ఉందని సర్వే రిపోర్టులు రావటంతో ఆ దిశగా ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఏఏఐ అధికారులు ఫోకస్ చేస్తున్నారు. ప్రస్తుతం మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను ఇటీవల ఏఏఐ అధికారులు పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. మిగతా 253ఎకరాల భూమిని కేటాయిస్తే ఎయిర్ బస్‌లను నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐఅధికారులు ప్రభుత్వానికి సూచించారు.

తొలగిన అడ్డంకులు.. కేంద్రం గ్రీన్‌సిగ్నల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ ఎయిర్ పోర్టును అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగి అడ్డంకిగా ఉన్న 150కిలోమీటర్ల నిబంధనపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (హెచ్ఐఏఎల్)తో చర్చించారు. ఈ క్రమంలో హెఐఏఎల్ నుంచి 150కిలో మీటర్ల నిబంధనపై నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ)ఇప్పించారు. ఇక ఇప్పటికే 669ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉండగా..ఇప్పుడున్న రన్‌వేను విస్తరించటంతో పాటు టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్టుమెంట్, ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టేందుకు ఎయిర్‌పోర్టుకు మరో 253 ఎకరాల భూమి అవసరంగా ఏఏఐ గుర్తించింది. దీంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ కోసం ప్రభుత్వం గత నవంబరులో రూ.205 కోట్లు కేటాయించింది. ఇప్పటికే జిల్లా రెవెన్యూ అధికారులు ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం రైతులతో సంప్రదింపులు జరపగా.. సమస్య ఓ కొలిక్కి వస్తోంది. ఈ రెండు అంశాలను కేంద్ర విమానాయ మంత్రిత్వశాఖకు ఏఏఐ నివేదిక ద్వారా తెలియజేసింది. దీంతో వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే వరంగల్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సుమారు రూ.450కోట్ల వరకు నిధులు అవసరంగా అంచనా వేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. వరంగల్ ఎయిర్ పోర్టు త్వరగా పూర్తయితే తెలంగాణకు రెండో విమానాశ్రాయం ఏర్పడినట్టవుతుంది.

ఫలించిన ప్రభుత్వ ప్రయత్నాలు..

వరంగల్‌లో ఎయిర్‌పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో పదేళ్లుగా హెచ్ఐఏఎల్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించటంలో విఫలం కావటంతో వరంగల్ ఎయిర్‌పోర్టుకు అడుగులు ముందుకు పడలేదనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా భూసేకరణ కోసం ఏఏఐ పలుమార్లు గత ప్రభుత్వానికి లేఖలు రాసింది. అయితే ప్రభుత్వ భూమితో పాటు రైతుల నుంచి భూసేకరణ చేయాల్సి ఉండగా, గత ప్రభుత్వం ఎయిర్‌పోర్టు భూసేకరణపై చేసిన ప్రయత్నాలు ఫలించకపోవటంతో మూడు దశాబ్దాల గగనయానం ఓరుగల్లువాసులకు కలగానే మిగులుతూ వచ్చింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 253 ఎకరాల భూసేకరణకు రూ.205కోట్లు కేటాయించారు. అంతేకాకుండా కేంద్ర విమానాయశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసి తెలంగాణలో కొత్తగా ఆరు ఎయిర్‌పోర్టుల అవసరంపై వివరించటంతో పాటు వరంగల్‌లో అన్ని అర్హతలు ఉన్న ఎయిర్‌పోర్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్ పోర్టుపై ఏఏఐ నివేదికలను పరిశీలించి శుక్రవారం అనుమతులు మంజూరు చేసింది.

ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్‌పై ఎంపీ కావ్య హర్షం

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఎంపీ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి గతంలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖకు లేఖలు అందచేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టు కోసం, ఇందుకున్న అడ్డంకులు తొలగించడంలో సీఎం చర్యలు తీసుకున్నారన్నారు. ఎయిర్ పోర్టు భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల భద్రత పట్ల పాలకుల ఉదాసీనత

- ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి పాండురంగాచారి



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి పాండురంగాచారి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికుల జాడ నేటికి తెలియకపోవడం వారి భద్రత పట్ల పాలకుల ఉదాసీన వైఖరికి నిదర్శమని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి రాయబండి పాండురంగాచారి ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం సంఘం జిల్లా ద్వితీయ మహాసభలు బొల్లోజు రాంమోహనాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రం హరించి వేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత, హక్కులు హరించే విధంగా ప్రభుత్వ విధానాలున్నాయని ఆరోపించారు. కార్మికులు సంఘటితమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, వేల్పుల వెంకన్న, గోనె కుమారస్వామి, మాచర్ల సత్యనారాయణ, వేముల వీరేష్, చాపల మహేందర్ పాల్గొన్నారు.



రంజాన్ కా.. మహెనా ఆగయా..

రేపటి నుంచి ఉపవాస దీక్షలు షురూ

మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : యావత్ ముస్లింలు భక్తిశ్రద్ధలతో కఠోర నియమాలతో చేపట్టే ఉపవాస దీక్షల రంజాన్ మాసం మార్చి 2 నుంచి ఆరంభమవుతోంది. లూనార్ ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలు ఈ పండుగను నిర్ణయించుకుంటారు. ఆ క్రమంలోనే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ముస్లింలు శనివారం నెలవంక దర్శనం చేసుకుని, రాత్రి మసీద్‌లో తరావీహ్‌నమాజ్‌ల ద్వారా రంజాన్ ఉపవాస దీక్షల మాసాన్ని ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించుకోనున్నారు. పండుగ ఆరంభాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మసీద్‌లను రంగులు, విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబవుతున్నాయి. ఏటేటా మాసం తగ్గుతూ వివిధ రుతువులను స్పృషిస్తూ వచ్చే రంజాన్ మాసం ఈసారి మండుటెండల మార్చి ఆరంభం 2వ తేదీ నుంచి మొదలవుతుంది. అయినా అంతా అల్లాహ్‌పై భారం వేసుకుని లాలాజలాన్ని కూడా మింగకుండా కఠోర దీక్షతో సూర్యోదయానికి ముందే ఆరంభించే ఉపవాస దీక్షలకు అంతా సన్నద్ధమైపోయారు.

కఠోర ఉపవాస దీక్షలు

ముస్లిం సోదరులు వయో, లింగబేధాలు లేకుండా పాటించే రంజాన్ మాసంలోని కఠోర ఉపవాస దీక్షల వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. సూర్యోదయానికి ముందే తెల్లవారుజామున నిర్ణీత వేళలో సహర్ పేరిట భోజనం ముగించుకుని అప్పట్నుంచే ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం అయ్యాక సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్షను డ్రైఫ్రూట్ లేదా పండ్లు, ఫలాలతో విరమిస్తారు. ఆపై యథావిధిగా భోజనం తీసుకుంటారు. దీక్షా సమయంలో కఠోర నియమాలు పాటించడంతో పాటు ప్రతిరోజు నిత్యం ఐదుసార్లు నమాజ్ చేయడం అనవాయితీగా కొనసాగిస్తారు. ప్రతీ సెకను కూడా అల్లాహ్ నామస్మరణతో తమ విధుల నిర్వహణల్లో నిమగ్నమవుతారు. చంద్ర దర్శనాన్ని బట్టి ఈ మాసం 29 లేక 30 రోజుల పాటు కొనసాగుతుంది.

పండుగ మాసంలో మనో నిగ్రహం..

రంజాన్ పండుగ మాసానికి వెనుక విశిష్ట ప్రాధాన్యత ఉంది. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ నెల రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపచేయడం ద్వారా ఆత్మప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్ష 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్న పానీయాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరం పళ్లతోనే ఉపవాస దీక్ష విరమించేవారని విశ్వసించే ముస్లింలు రంజాన్‌లో ఆచరిస్తారు. దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన ఈ మాసంలోనే హజ్రత్ దావూద్ అలైకు జబూర్ గ్రంథం, హజ్రత్ మూసా అలైకు తౌరాత్ గ్రంథం, హజ్రత్ ఈసా అలైకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడిందని నమ్ముతారు.

ఈ నెలలో ప్రత్యేకతలివే..

రంజాన్ మాసంలో సహృదయంతో దైవభక్తి ఒక సత్కార్యం చేసే వ్యక్తికి ఇతర మాసాల్లో చేసిన విధి (ఫరజ్)కి వచ్చే పుణ్యఫలం లభిస్తుంది. ఒక విధిని నిర్వహిస్తే ప్రతిఫలంగా దేవుడు ఇతర మాసాల్లో లభించే 70 విధులకు సమానమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తాడంటారు. దివ్య ఖుర్‌ఆన్ ఈ మాసంలోనే అవతరించింది. హజ్రత్ దావూద్ అలై సలాంకు ఈ మాసంలోనే జబూర్ గ్రంథం ఇవ్వబడింది. హజ్రత్ మూసా అలైసలాంకు తౌరాత్ గ్రంథం ప్రసాదించబడింది. హజ్రత్ ఈసా అలై సలాంకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడింది. హజ్రత్ జిబ్రాయిల్ అలై సలాంకు ప్రతీ సంవత్సరం ఈ మాసంలోనే మహా ప్రవక్తకు దివ్య ఖుర్ ఆన్ సంపూర్ణంగా వినిపించే వారు. ఉపవాసాలు (రోజా) విధిగా నిర్వహించబడ్డాయి. రంజాన్ ఆరంభం కాగానే 'తరావీహ్' నమాజ్ ఆదేశించబడింది. వేయి రాత్రులకంటే పుణ్యప్రదమైన రాత్రి 'లైలతుల్ ఖద్ర్' ఈ మాసంలోనే ఉంది. ఆర్థిక ఆరాధనైన 'జకాత్' చెల్లించడం. నిరుపేదల హక్కు అయిన 'ఫిత్రా' చెల్లించడం. దైవ ప్రసన్నత చూరగొనే మౌనవ్రతం (ఏతెకాఫ్) పాటించడం. మహాప్రవక్తకు రమజాన్ మాసం 21వ తేదీన ప్రవక్త పదవి లభించింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని బఖరా సూరాలోని తొలి ఐదు ఆయతులు అవతరించాయి. మొట్టమొదటిదైన బదర్ యుద్ధం ఈనెలలోనే జరిగింది.

- ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న మస్జీద్‌లు
- మనో నిగ్రహానికి ప్రతీక ఈ మాసమే..
- ఎన్నో ప్రత్యేకతలతో ఆధ్యాత్మికత పెంపు

ఉపవాసాలతో ఆరోగ్యం కూడా..

రమజాన్ మాసంలో ఉపవాస దీక్షలు దైవ భక్తికోసమే కాకుండా ఆరోగ్య రీత్యా కూడా మేలైనదని వైద్య శాస్త్రం పేర్కొంటోంది. ఉపవాస దీక్షలో పగలంతా ఆహారం తీసుకోకపోవడం వల్ల కొంతకాలం జీర్ణవ్యవస్థకు విశ్రాంతి లభించి జీర్ణక్రియ క్రమబద్ధీకరించబడుతుంది. మితహారానికి అలవాటు పడడంతో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఉపవాస దీక్ష నిత్య జీవితంలో క్రమశిక్షణాయుత జీవన శైలిని అలవాటు చేస్తుంది. పగలంతా కనీసం నీరు కూడా తాగకపోవడం వల్ల శరీరంలోని వివిధ రసాల ఉత్పత్తి క్రమబద్ధీకరించబడుతుంది. స్వీయ క్రమశిక్షణ, మార్గదర్శకం, డైట్ కంట్రోల్‌కు మూలం. తగిన మోతాదులో ఫలాలు, మాంసకృత్తులు తీసుకోవచ్చు. ఉపవాసదీక్ష వల్ల రక్తపోటు కొలెస్ట్రాల్ తగ్గిస్తుందని వైద్య పరిశోధనల్లో తేలింది. బాహ్య సంబంధమైన అంశాలతో పాటు అంతరంగిక మనసు ప్రశాంతంగా ఉంటుంది. సూక్ష్మ గ్రాహ్యమైన బుద్ధి అభివృద్ధి చెందుతుంది. ఇంద్రీయ వాంఛనలను అదుపులో పెట్టుకున్న కారణంగా మృదువుగా మాట్లాడడం, దురలవాట్లకు, ఘర్షణలకు దూరంగా ఉండడం, నేర ప్రవృత్తి తగ్గించడం సాధ్యమవుతుంది. రాత్రివేళ తరావీహ్ నమాజ్ చేయడం వల్ల ఒక్కొక్క రకాత్‌కు పది క్యాలరీల శక్తి ఉత్పన్నమై, ఆహారం జీర్ణమై సంపూర్ణ శక్తిగా మారుతుంది. కీళ్ల కదలిక మంచి వ్యాయామంగా ఉపకరిస్తుంది. బ్లడ్ షుగర్ ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో ఉపవాస నెలలో ఒకటి రెండుసార్లు రక్త పరీక్ష చేయించుకుంటే ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్ పరిమాణం తెలుస్తుంది. రాండమ్ బ్లడ్ గ్లూకోజ్ పరీక్షలో గ్లూకోజ్ పరిమాణం 70 ఎంజి శాతం ఎక్కువగా ఉంటే ఉపవాసం ఉండవచ్చు. తక్కువగా ఉంటే అపవాసం కొనసాగించవద్దని వైద్యులు చెబుతారు.



రంజాన్ మాసం ప్రత్యేకత ఉపవాస దీక్ష

యావత్ ప్రపంచ ముస్లింలకు అత్యంత పవిత్రమాసం రంజాన్. ఈ మాసంలోనే మహ్మద్ ప్రవక్త పేరిట ఖురాన్ అవతరించింది, అందుకే రంజాన్ నెలకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుని ఉంటుంది. నెలవంక దర్శనాన్ని బట్టి 29 లేదా 30 రోజుల పాటు ముస్లింలంతా ఉపవాస దీక్షలు (రోజా) చేస్తారు. ఈ దీక్షలతో నిరుపేదల ఆకలి బాధలు తెలుస్తాయి. సుమారు 15 గంటలు చుక్క నీరు ముట్టకుండా ఉపవాసదీక్షల్లో ఉంటాం. అల్లా అన్ని చూస్తుంటారని విశ్వసిస్తాం.

- మౌలానా సయీద్ అహ్మద్ రిజ్వీ, మత పెద్ద, మహబూబాబాద్



క్షమార్హగుణం నేర్పేదే రంజాన్

ఆ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది అనే శత్రువుల మధ్య కూడా క్షమార్హ గుణం నేర్పేదే రంజాన్ మాసం. ఈ నెలలోనే ఎవరైనా ఆ శత్రుత్వాన్ని వీడి స్నేహ సౌభ్రాతుత్వాన్ని ఆస్వాదించాలి. ఇదే విషయాన్ని ఖురాన్ చెబుతుంది. ఎదుటి వారు ఎన్ని తప్పులు చేసినా వారిని పెద్ద మనసుతో క్షమించాలి. మళ్లీ పొరపాట్లు జరగకుండా జీవితాన్ని సాగిస్తామని ప్రతిజ్ఞ చేయాలి.


- ఎమ్డి. ఎక్బాల్, ఇస్లాహె మాషిరా కమిటీ మానుకోట జిల్లా అధ్యక్షుడు



సహన గుణాలు అలవర్చుకుంటారు

ఆకలి బాధలను గుర్తెరిగే ఉపవాస దీక్షలతో దప్పికల నుంచి ఓర్పు, సహనసుగుణాలను అలవర్చుకుంటారు. ఆకలితో ఉన్న వారిని ఆదుకోవాలనే తత్వాన్ని స్వీకరిస్తారు. ఈ నెల రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనతో చేసిన ఉపవాసాలను 11 నెలల పాటు స్ఫూర్తిగా కొనసాగించి వచ్చే రంజాన్‌కు మరింత భక్తి శ్రద్ధలను పెంచుకునే దిశగా ముందుకు సాగాలని నిశ్చయించుకుంటారు.

- మహ్మద్ చాంద్ పాషా, సెక్రెటరీ సదర్, మదర్సా గుల్షాన్ ఖాజా గరీబ్ నవాజ్, మహబూబాబాద్





ప్రారంభ వేడుకకు హాజరైన నిట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు

- ప్రముఖ సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం
- వరంగల్ నిట్ విద్యార్థులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం
- జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్ స్ప్రీకి ప్రారంభోత్సవం



జీవితం ఒక ఆట.. ఆడుతూనే ఉండాలి..

'ఒకప్పుడు మాది చాలా పేద కుటుంబం. మా కుటుంబంలో ఎనిమిది మంది సంతానం. ఆ రోజుల్లో మమ్మల్ని చదివించాలంటే చాలా కష్టపడేవాడు మా నాన్న. ఆ పరిస్థితుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని అవమానాలు జరిగినా పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలని అనుకున్నాను. లక్ష్యాన్ని సాధించాను.' అని గతాన్ని గుర్తు చేసుకున్నారు బ్రహ్మానందం. పేదరికం నుంచి ఎదగాలంటే లాల్ బహదూర్ శాస్త్రి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, రైల్వేస్టేషన్‌లో చాయ్‌లమ్మి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన నరేంద్ర మోదీ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వీరంతా పేదరికంలో పుట్టి చదువుకొని పైకి వచ్చినవారన్నారు. అట్లాగే కష్టపడి పైకి వచ్చిన తాత్వికుల్లో రామక్రిష్ణ పరమ హంస, వివేకానందుడు, జిడ్డు క్రిష్ణమూర్తి వంటి వారు కూడా ఉన్నారన్నారు. వీరు ఆర్థికంగా పేదవారు కావచ్చు. కానీ మేధోపరంగా ఎంతో ఉన్నతులని శ్లాఘించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంతోనే సరిపెట్టుకోవద్దని, మనలో దాగి ఉన్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకోవడం ద్వారా కిష్టమైన రంగంలోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవితం ఒక ఆట.. దానితో ఆటాడాల్సిందేనని ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ గ్రహీత, డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లోని పాత ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025)ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. తాను ఒకప్పుడు లెక్చరర్‌నని, పేదరికం అధిగమించి ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డానన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. తనలాగే ఇక్కడి విద్యార్థుల్లో ఎంతో మంది పేదవారు ఉండొచ్చని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని, ఇలాంటివారికి ధైర్యం చెప్పడానికే తాను ఇక్కడికి వచ్చానన్నారు. చదువుకోవాలనే కాంక్ష ఉన్నప్పుడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా లెక్క చేయకూడదన్నారు. మనం లక్ష్యాన్ని ప్రేమించాలి. ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలని ఉద్బోధించారు. గమ్యాన్ని ఒక్కదాన్నే కాకుండా మార్గాన్ని కూడా ప్రేమించాలని పిలుపునిచ్చారు. మనం ఎంచుకున్న మార్గంలో రకరకాల ఇబ్బందులు వస్తూనే ఉంటాయన్నారు.

చదువుకు పేదరికం అడ్డకారాదు..

తాను లెక్చరర్‌గా పని చేస్తున్న కాలంలోనే ఇంకేదో చేయాలన్న తపన తనలో ఉండేదని బ్రహ్మానందం అన్నారు. దేవుడు తనను నటన వైపు మళ్లించాడని చెప్పారు. దేవుడు ప్రతీ ఒక్కరికి ఒక అవకాశం ఇస్తాడని, మనకు ఏది కావాలో చెబుతాడు తప్ప.. అన్నిటినీ మన ముందుంచి ఏది తీసుకోవాలో చెప్పడన్నా రు. ఇచ్చిన దానిని సద్వినియోగ పరుచుకో వాలని అన్నారు. తనకు సినిమాల్లో నటించే అవకాశం వచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ స్థాయిలో ఉన్నానని బ్రహ్మానందం ఎంతో ఉద్వేగంగా వివరించారు. 'ఏ రిచ్‌మెన్ జోక్ ఈజ్ ఆల్వేస్ ఫన్నీ' అనే ఇంగ్లీష్ సామెతను ప్రస్తావిస్తూ డబ్బుకున్న ప్రాధాన్యతను వివరించారు. డబ్బు ఉంటేనే మనల్ని గౌర విస్తారన్నారు. పేదరికం నుంచి బయట పడి ఈ స్థితికి వచ్చి వందల మంది విద్యార్థుల ముందు నిలబడగలిగానంటే ఇందుకు కారణం పట్టుదల అన్నారు. జీవి తంలో ఎప్పుడూ రాజీపడరాదు. అనుకు న్నది సాధించే వరకు ప్రయాణం సాగి స్తూనే ఉండాలని పిలుపు నిచ్చారు.

చిన్నతనంలో అమ్మనాన్నలు నేర్పిన మంచి మాటలు, వారు చూపిన సన్మార్గంలో నడిచాను కనుకనే ఒక పద్మశ్రీ బ్రహ్మానందంగా, ఒక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు బ్రహ్మానందంగా, ఒక డాక్టర్ బ్రహ్మానందంగా మీ ముందున్నానన్నారు. స్ప్రింగ్ స్ప్రీ విజయవంతం కావాలని, మీ ముఖాలు బ్రహ్మానందంగా వెగిలిపోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కాగా, బ్రహ్మానందం ప్రసంగాన్ని విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ ఆస్వాదించారు. అనంతరం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ డాక్టర్ బ్రహ్మానందకు శాలువా కప్పి సత్కరించారు. స్ప్రింగ్ స్ప్రీ జ్ఞాపికను అందచేశారు. బ్రహ్మానందం రాక సందర్భంగా గట్టి భద్రత ఏర్పాటు చేశారు. బ్రహ్మానందం నిట్ క్యాంపస్‌లో సుమారు 3 గంటలు ఉన్నారు.

తొలుత వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. స్ప్రింగ్ స్ప్రీ ఉద్దేశ్యాన్ని, దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, కల్చరల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, స్టూడెంట్ అక్టివిటీ (ఎస్ఏటీ) కల్చరల్ సొసైటీ ప్రతినిధి రణధీర్, ఎస్ఏటీ టెక్నికల్ సొసైటీ ప్రతినిధి ఇషాన్ శర్మ, సాక్ స్పోర్ట్స్ సొసైటీ ప్రతినిధి అథర్వ దేశ్‌పాండే, సాక్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీ ప్రతినిధి జి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడూరి రేణుక బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి.

ప్రయత్నిస్తూ మరణిస్తే అది విజయం... ప్రయత్నం విరమిస్తే అది మరణం అన్న తెలుగులోని ఒక సూక్తిని బ్రహ్మానందం ఈ సందర్భంగా ప్రస్తావించారు. తాను నిరంతరం ప్రయత్నిస్తున్నాను కనుకనే సినిమా రంగంలో 40 ఏళ్లుగా 1250కి పైగా చిత్రాల్లో నటించానన్నారు. ఇక్కడున్న విద్యార్థులెవరూ తాను సినిమా రంగంలో ప్రవేశించే నాటికి పుట్టి ఉండరన్నారు. అయినా తన ప్రస్థానం మరింత కాలం కొనసాగాలంటే వారి ఆశీస్సులు కావాలని కోరారు. ఆశీర్వదించడానికి వయసు కాదు.. మనసు ముఖ్యం అన్నారు. ఇతరులను మనం గౌరవించిప్పుడే.. వారు మనల్ని గౌరవిస్తారన్నారు. ఎదుటి వారు ఎలా ఉండాలని మనం కోరుకుంటామో భగవంతుడు ముందు మనల్ని అలాగే ఉంచుతాడన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతంగా జీవించాలని, మనం ఆరోగ్యంగా ఉంటేనే మన ఆలోచనలు కూడా బాగుంటాయని, మన ఆలోచనలు బాగుంటే మనం మంచి పనులు చేస్తామని, మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, మంచి ఫలితాలు వస్తే దేవుడు సంతోషిస్తాడని, దేవుడు సంతోషిస్తే మనకు మోక్షం ప్రసాదిస్తాడని, మంచి పనులు చేస్తే మోక్షం వస్తుందని వివరించారు.

సినిమాల నిర్మాణంలో కొత్త పోకడలు

- కొత్తదనం కోరుకుంటున్న ప్రేక్షకులు
- షార్ట్ ఫిలిమ్స్‌లో నిట్ విద్యార్థుల అద్భుత ప్రతిభ
- సినీ దర్శకుడు వశిష్ట
- ఆకట్టుకున్న డైరెక్టర్ కట్స్ ఈవెంట్



డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌లో విద్యార్థులను ఉద్దేశించి మట్లాడుతున్న దర్శకుడు వశిష్ట

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సినిమా నిర్మాణంలో కొత్త పోకడలు చోటు చేసుకుంటున్నాయని, ప్రేక్షకుల అభిరుచి మేరకు చిత్రాల నిర్మాణం జరుగుతోందని బింబిసారా, విశ్వంభర చిత్రాల దర్శకుడు వశిష్ట అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో ప్రారంభమైన వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025)లో భాగంగా నిర్వహించిన డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌లో ముఖ్యఅతిథిగా వశిష్ట పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వశిష్ట మాట్లాడుతూ.. ప్రేక్షకులు కథ, కథనం, నిర్మాణంలో కొత్తదనం కోరుకుంటున్నారన్నారు. ప్రేక్షకుల అభిరుచి మేరకే బింబిసారా తీశానని అన్నారు. విశ్వంభర కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వశిష్ట తన సినీ ప్రయాణం, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థుల్లో కూడా గొప్ప దర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ఇష్టాగోష్టి ఆద్యంతం ఉల్లాస భరితంగా సాగింది. చర్చలు, హాస్యపూరిత సంభాషణలు, సినీ పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. వశిష్ట తీసిన చిత్రాల గురించిన ప్రశ్నలు అడగ్గా, ఆయన వాటికి జవాబులు చెప్పారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన రెండు షార్ట్‌ఫిల్మ్‌లు కృష్ణుడివారసులంతా, అలాగే మకర చిత్రాలను ప్రదర్శించారు. వీటిని చూసిన వశిష్ట.. విద్యార్థులను ప్రశంసించారు. వారిలో సృజనాత్మకత అబ్బురపరిచిందన్నారు. చిత్ర నిర్మాతలకు మార్గదర్శనం చేశారు. ఈ రెండు లఘు చిత్రాలు ప్రేక్షకుల నుంచి సైతం ప్రశంసలు అందుకున్నాయి. తొలుత స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య స్వాగతం పలికారు. డైరెక్టర్ కట్స్ ఈవెంట్ విశిష్టతను వివరించారు.

ఎమ్మెల్సీ దంగల్!

(5వ పేజీ తరువాయి)

ఏఐసీసీ స్థాయిలో ఎమ్మెల్సీ సీటుపై ఒత్తిడి తీసుకవస్తున్నారనే చర్చ జరుగుతుంది. కొండా మురళీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత వి.హనుమంతరావు సైతం ఎమ్మెల్సీ బరిలో ఉన్నారని, అలాగే మాజీ ఎంపీ మధు యాష్కి కూడా బీసీ కోటాపై కన్నేసినట్టుగా తెలుస్తోంది. అలాగే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారినా పార్టీ కోసం సాంబయ్య పని చేశారనే అభిప్రాయం పార్టీలో ఉంది. దీంతో సాంబయ్యకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి చేసినా ఎస్సీ సామాజిక వర్గం నుంచి అద్దంకి దయాకర్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ పోటీలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినవారికి ఈసారి ఎమ్మెల్సీ ఇవ్వొద్దని అధిష్ఠానం షరతు పెట్టినట్టుగా పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరితో పాటు ఇందిరాలకు అవకాశాలు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఓసీ సామాజిక వర్గం నుంచి మాత్రం సీఎంకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ సీటు దక్కేందుకు ఎలాంటి అవరోధాలు లేకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా కులాల సమీకరణలు ఎవరికి కలిసి వస్తాయో.. కాంగ్రెస్‌లో ఏ నేతను ఎమ్మెల్సీ సీటు వరిస్తుందో అనే ఉత్కంఠ శ్రేణుల్లో నెలకొంది.

గులాబీ ఎమ్మెల్సీ ఎవరో..?

ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానం మాత్రం బీఆర్ఎస్‌కు పక్కాగా దక్కే అవకాశాలున్నాయి. రెండో స్థానానికి కావాల్సిన ఎమ్మెల్యేల బలం లేకపోవటంతో దక్కే ఒక్క సీటు ఎవరికి అనేది పార్టీలో ఆసక్తికరంగా మారింది. అయితే ఇటీవలే మండలి విప్‌గా డోర్నకల్‌కు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌ను కేసీఆర్ నియమించారు. పదవీకాలం పూర్తవుతున్న సమయంలో సత్యవతిని విప్‌గా నియామించారంటేనే.. మరోసారి ఆమెకే ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వనున్నట్లుగా పార్టీ సంకేతాకాలు ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న సవాళ్లను గట్టిగాఎదుర్కొని ప్రజల్లో తిరుగుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వొచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఎర్రబెల్లి అయితేనే మండలిలో పార్టీ వాణిని బలంగా వినిపించే అవకాశం ఉంటుందని, అధిష్ఠానం దయాకర్‌రావు వైపే మొగ్గు చూపుతుందనే చర్చ గులాబీ పార్టీలో ఉంది. మొత్తానికి ఎమ్మెల్సీ సీటు ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో హాట్‌హాట్‌గా మారింది.

'కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న ప్రవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న తరుణంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వమని విద్యార్థులు వెళ్లితే ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని వత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేటప్పుడు ఉచిత విద్య నందిస్తామని, పరీక్షల సమయంలో ఫీజుల పేరుతో విద్యార్థులను మానసిక వత్తిడికి గురుచేస్తున్నారని, వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణ, సాయి, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దర్జీల దినోత్సవం


సీరోలు మండలం కాంపెల్లిలో దర్జీల దినోత్సవంలో పాల్గొన్న మహిళా టైలర్లు


కేసముద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్


మహబూబాబాద్ టైలర్స్ డేలో పాల్గొన్న మేరు సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మేరు సంఘం భవనంలో సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత కుట్టు మిషన్ రూపకర్త విలియం హోవ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమ కోటేశ్వరరావు, అడప మల్లికార్జున్ మాట్లాడారు. రెడీమేడ్ వ్యవస్థ రంగ ప్రవేశంతో దర్జీ పనులు లేక మేరు కులస్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టణంలో సీనియర్ టైలర్లు రామగిరి అశోక్, వెన్ను వెంకటేశ్వర్లును శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల రమేష్, వెన్ను ప్రవీణ్, సోమ అశోక్, సింగు రమేష్, సమ్మయ్య, సర్వేశ్వరరావు, వేణు, రాజు, శ్రీధర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సోమ విజయ్‌కుమార్ కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హోవ్స్‌కు నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి రాయబారపు సురేందర్, కోశాధికారి గట్ల భిక్షపతి, రాయబారపు భూమయ్య, హరికృష్ణ, అడప రాజు, వెన్ను భిక్షపతి, రామగిరి శ్రీనివాస్, కీర్తి సారంగపాణి, వీరస్వామి, కొత్తకొండ యాదగిరి, ఎండీ.పాషా, రఫి, సమ్మయ్య, కొమురయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

● కొత్తగూడ మండల కేంద్రంలో టైలర్స్ డేను నిర్వహించారు. గంగపురపు భిక్షపతి, రామగిరి యాదగిరి, ధీకొండ నర్సయ్య, గూడూరు దుర్గా ప్రసద్, రవీందర్ , గణేష్, రాంనర్సయ్య, శ్రీనివాస్ , సాయికుమార్, సురేష్ పాల్గొన్నారు.

● సీరోలు మండలం కాంపెల్లి గ్రామంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా టైలర్లు కేతమ్మ, సంధ్య, ఉపేంద్ర, సుజాత, జమున, హేమలత పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేత కొంపెల్లి

మరిపెడ, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నేత కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రాత్రి ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి ఢిల్లీలోని ఆయన అధికారిక నివాస భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా రాజకీయాలపై వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్‌రెడ్డి వెంట శ్రీధర్‌రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మంద కృష్ణను కలిసిన నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను జైభీమ్ ఫౌండర్ బరిగల శివఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వర్గీకరణ సాధన కోసం ఎనలేని కృషి చేసిన గొప్పనేత అని కొనియాడారు. మంద కృష్ణమాదిగను కలిసిన వారిలో తొర్రూరు మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎమ్డీ.యాకూబ్, ఎల్తూరి వినోద్ కుమార్ ఉన్నారు.


మందకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగన్న

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం బత్తుల వెంకన్న అధ్యక్షతన హమాలీ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ రైస్‌మిల్లులు, గోడౌన్లు, వ్యవసాయ మార్కెట్లలో పని చేస్తున్న హమాలీలు, కూలీలకు మూడునెలలు పనిఉంటే మిగతా సమయంలో పని దొరక్క ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారికి పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతీ హమాలీ, కూలీకి రూ.6వేల పింఛన్ సౌకర్యం కల్పించడంతో పాటు వ్యక్తిగత భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో క్రాంతి, రమి, హేమా, నాగమ్మ, లచ్చు, హరి, సుశీల, మంగమ్మ, లాలు, లక్ష్మణ్, కోటి, సునిత పాల్గొన్నారు.

పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం

కొత్తగూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలాల్లో సైన్స్ డేను శుక్రవారం నిర్వహించారు. పొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేశారు. విద్యార్థులు తాము చేసిన ప్రయోగాలను పాఠశాల్లో ప్రదర్శించారు. ఉపాధ్యాయులు సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నెల్లుట్ల భాస్కర్, ఉపాధ్యాయులు నర్సయ్య, సుమన్, భాషమియా, సాంబయ్య, సూరయ్య, రాజ్‌కుమార్, జేబీ, మాధవి, భిక్షపతి పాల్గొన్నారు.

● మరిపెడ, (ఆంధ్రజ్యోతి) : సీతారాంపూర్ హైస్కూల్లో సైన్స్ డేను నిర్వహించారు. సైన్స్ డేపై హెచ్ఎం రాంచంద్రయ్య విద్యార్థులకు అవగాహన కలిపించారు. పిల్లలకు క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందచేశారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ఎస్‌వీవీ శ్రీచైతన్య, కల్వల, పెనుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ డే నిర్వహించారు. ఎస్‌వీవీలో కేసముద్రం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ కోల రాందాస్, సుధాకర్, కొమ్మాల వెంకట్‌రెడ్డి, కల్వలలో హెచ్ఎం నరేందర్, వేముల నాగేందర్, ఆర్.భిక్షపతి, రాములు, శ్రీనివాస్, పెనుగొండలో హెచ్ఎం యాదగిరి పాల్గొన్నారు.

● నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి) : మేచరాజుపల్లి హైస్కూల్‌లో సైన్స్‌దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో రాందాస్, హెచ్ఎం మంగతాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పొగుళ్లపల్లి పాఠశాలలో ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు రోలర్ అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా దొంగలు బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్‌లు, వాహనాలను చోరీ చేయడం చూశాం. కానీ, వెరైటీగా కొంతమంది దుండగులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు రోలర్‌ను అపహరించుకుపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లో కెళ్తే.

ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన బిక్షంరెడ్డి రోడ్డు రోలర్‌ను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డు సమీపంలోని ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసి ఉంచాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు దానిని ఎలాగైనా దొంగిలించాలని వ్యూహాలు రచించారు. నాగపూర్‌కు ఎంఎస్ కన్‌స్ట్రక్షన్ సివిల్ రైల్వే కాంట్రాక్టర్ మోహన్‌మిశ్రా పేరిట రోడ్డు రోలర్‌కు నకిలీ కాగితాలు సృష్టించి, జేసీబీ సాయంతో రోడ్డురోలర్‌ను సూర్య థియేటర్ సమీపంలోని ఓ ఇనుప దుకాణంలో మూడ్రోజుల కిందట రూ.2.19 లక్షలకు విక్రయించారు. అసలు యాజమాని గురువారం ఖమ్మం నుంచి మహబూబాబాద్‌కు వచ్చిన ఆయనకు ఆర్వోబీ కింద పార్కింగ్ చేసిన రోడ్ రోలర్‌ను కన్పించకపోవడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. మర్నాడు శుక్రవారం సైతం పరిసరప్రాంతాల్లో వెతుకుతుండగా సూర్యథియేటర్ పాత ఇనుప కొట్టు దుకాణంలో కన్పించింది. దీంతో ఆ షాపు యాజమానిని రోడ్డు రోలర్‌ను ఎలా కొనుగోలు చేశావని ప్రశ్నించడంతో తాను నకిలీ పత్రాలను చూసి మోసపోయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. రోడ్డురోలర్ యాజమాని బిక్షంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.


అపహరించుకుపోయిన రోడ్డు రోలర్ ఇదే

సీవీ రామన్‌కు నివాళి

తొర్రూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శుక్రవారం తొర్రూరు మునిసిపల్ పరిధిలో, మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. విద్యార్థులు తాము సైన్స్‌పై చేసిన ప్రయోగ పరీక్షలను ఉపాధ్యాయులు పరీక్షించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ శారదాదేవి, జైపాల్‌రెడ్డి, కృష్ణ, యాకూబ్, ఉపేందర్ రెడ్డి, స్వర్ణలత, షేక్ దర్గా హుస్సేన్, లక్ష్మీనారాయణ, బ్రహ్మానందరెడ్డి, మహమూద్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా కుమార్


కుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంగీలాల్‌నాయక్

డోర్నకల్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : లంబాడి హక్కుల పోరాట సమితి ఏక్ మాత్రో డోర్నకల్ మండల ఇన్‌చార్జిగా దారావత్‌కుమార్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డోర్నకల్‌లో శుక్రవారం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోతు మంగీలాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. తనపై నమ్మకం ఉంచి డోర్నకల్ ఎల్‌హెచ్‌పీఎస్ ఇన్‌చార్జిగా నియమించిన మంగీలాల్‌కు, సమావేశానికి హాజరైన వారికి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. బానోత్ రాందాస్, బాదావత్ రాజారాం, తేజావత్ శ్రీను, బానోత్ బాలు, బానోత్ బద్యా, దారావత్ నరేష్, క్రాంతి పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి తెప్పోత్సవం

కురవి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం తెప్పోత్సవ కార్యక్రమం జరుగనుంది. సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఈవో సత్యనారాయణ, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. తెప్పోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయం నుంచి చెరువు వరకు భద్రకాళి సమేత వీరభద్రస్వామిని ఊరేగింపుగా తీసుకువస్తారు. కేరళ బృందాలు, అమ్మవారి వేషధారణలో కళాకారులు, డప్పు కళాకారులు, కోలాట కళాకారులు ప్రదర్శన నడుమ ఊరేగింపు కొనసాగుతుంది. అనంతరం స్వామివారిని పడవలో జలవిహారం చేయిస్తారు.

అక్రమ క్వారీని మూసివేయాలి : సీపీఐ

కురవి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీని అధికారులు తక్షణమే మూసివేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ప్రతినిధి బృందం క్రషర్ నిర్వహిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 188 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని అక్రమంగా లీజుకు తీసుకుని తమ పట్టాభూమిలో క్రషర్ మిల్లు పెట్టి ప్రభుత్వ గుట్టలను ఎలాంటి అనుమతులు లేకుండా కొల్లగొడుతున్నారని ఆరోపించారు. క్రషర్ వల్ల చుట్టుపక్కల పంటలు వేసిన రైతులు, పక్కనే ఉన్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు, గుడిసెవాసులు బాంబుల మోతతో భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సత్రానికి వాటర్‌ప్లాంట్ బహూకరణ

కురవి, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : కురవిలోని ఆర్యవైశ్యసత్రానికి మహబూబాబాద్‌కు చెందిన వాసవిక్లబ్ కపుల్స్ రూ.45 వేల విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను బహుమానంగా అందించారు. ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మాలె యోగీశ్వర్‌రావు ఈ వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, సామాజిక సేవ కొనసాగించాలని అన్నారు. వాసవి కపుల్స్ అధ్యక్షుడు నాళ్ల వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ జంగాల విజయ్, వనమాల సురేష్, వల్లాల రమేష్, ఈగ శ్రీనివాస్, పల్లపోతుల లక్ష్మీనారాయణ, జంగాల సదాశివుడు, తల్లాడ అంబరీష, తల్లాడ విజయ్, శ్రీరంగం నవీన్, బొడ్ల శ్రీనివాసరావు, మాలె నవీన్, వేమిశెట్టి యాకాంబ్రం పాల్గొన్నారు.

గౌడ కులస్థులంతా ఐక్యంగా ఉండాలి

● కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రేఖ శ్రీనివాస్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గౌడ కులస్థులందరూ ఐక్యంగా ఉండాలని కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్షుడు రేఖ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండెపుడిలో రూ.1.40 లక్షలతో దాత బయ్య సోమన్న-ఉపేంద్ర దంపతులు చేయించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. వీరత్వంలో శివాజీకి ఏ మాత్రం తగ్గని వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, తెలంగాణలో విప్లవ భావాలను నాటిన ధైర్యశాలని కొనియాడారు. తల్లి సర్వమ్మ పాపన్నను వీరుడిగా తీర్చిదిద్దారన్నారు. అగ్రకుల పెత్తనాన్ని ఎదురించడం ఒక్కరితో సాధ్యంకాదని, అన్నీ కులాల వారితో సైన్యాన్ని కూడగట్టుకొని అగ్రవర్ణాలకు చెందిన వివిధ వ్యాపారాలపై దాడి చేశాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోడపట్ల సుధాకర్, బోడపట్ల రవి, రేఖ వెంకన్న, రేఖ ఉప్పలయ్య, బోడపట్ల శ్రీనివాస్, ప్రవీణ్, నరేష్, గణేష్ పులుసు మల్లేష్, లింగస్వామి, లింగన్న, గుండగాని రంగనాథ్, లింగాల వెంకన్న, మల్సూర్, బయ్య పిచ్చయ్య, రేఖ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : కలెక్టర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదువాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ హైస్కూల్, మహాత్మాజ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ హైస్కూల్‌లో గురువారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో వసతి గృహ పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులు అడిగిన సందేహాలకు కలెక్టర్ పాఠ్యాంశాలను బోధించి, నివృత్తి చేశారు. వారు రూపొందించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరికరాలను ఆసక్తిగా తిలకించారు.

తాగునీటి సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలి

కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో, మునిసిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాలో ఆటంకాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. రంగాపురంలో మిషన్ భగీరథ పైపులైను లీకేజి మరమ్మతు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు తాగునీటి సరఫరాలో చిన్నచిన్న మరమ్మతులుంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. గ్రామాలతోపాటు శివారు ఆవాస ప్రాంతాలకు, ప్రభుత్వ వసతి గృహాలకు నిర్ణీత సమయం ప్రకారం తాగునీటి సరఫరా చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మారెడ్డి ఉన్నారు.


మైనార్టీ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పరీక్షా కాలం.!

(5వ పేజీ తరువాయి)

చేతికందిన ప్రశ్నపత్రాలను పూర్తిగా పరీక్షించాలి. తెలిసిన ప్రశ్నలన్నింటికి ముందుగా జవాబులు రాయడం పూర్తి చేయాలి. ఆ తర్వాత సందేహం ఉన్న ప్రశ్నలకు జవాబులు రాసేందుకు ఉపక్రమిస్తే కొంత ఒత్తిడి తగ్గుతుంది.

టెన్షన్ వదిలి, ప్రోత్సహించాలి..

పరీక్షలు ప్రారంభం అవుతున్నాయంటే పిల్లలతో పాటు పెద్దలకు టెన్షన్ మొదలవుతోంది. ఎలా చదువాలా.. అని పిల్లలు కంగారు పడుతుంటే వారిలో జ్ఞాపకశక్తి పెంచడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇవ్వడం లాంటి అంశాలపై పెద్దలు ఆందోళనలు చెందుతుంటారు. వీటన్నింటికి ముందుగా పరీక్షల సమయంలో పిల్లలకు ఇంటి వాతావరణం, అమ్మనాన్నల ప్రోత్సాహం అనుకూలంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పెద్దవాళ్లు తమ ఇష్టాలను పిల్లలపై రుద్దడం, అసలు చేయకూడదు. వీలైనంత వరకు పిల్లల ఆలోచన సరళికి అనుగుణంగా సపోర్టుగా ఉండాలి. అవసరమైనప్పుడు వారిలో ఒత్తిడి భయాందోళనను తొలగించే రూపంలో కబుర్లు చెప్పాలి. చదువుకునే ప్రక్రియలో పిల్లలు అనుకూల వాతావరణంలో సంతోష పడేలా చూడాలి.

జ్ఞాపకశక్తి పెంచే ఆరోగ్య ఆహారం..

విద్యార్థి దశలో చదువుకోవడంతో పాటు ఆ చదువుకు సార్థకత చేకూరాలంటే పరీక్షల్లో నెగ్గాలి. ఈ రెండు విద్యలో భాగమని ఎప్పుడైతే విద్యార్థులు గుర్తిస్తారో తప్పకుండా సక్సెస్ వైపు పయనిస్తారు. పిల్లలు చురుగ్గా ఆలసట లేకుండా ఉండకలిగితే జ్ఞాపకశక్తి అంతే పాదరసంలా పని చేస్తుంది. చదువు మధ్యలో కాస్త రిలీఫ్ కోసం ఆహారం ఇస్తుండాలి. బ్రెయిన్‌ఫుడ్ జ్ఞాపకశక్తిని పెంచుతోంది. మెదడు చురుకుగా పని చేయాడానికి ఆరోగ్యవంతమైన ఫ్యాట్స్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని రకాల గింజలు, నట్స్ తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతోంది. బాదం, పిస్తా, జీడిపప్పుల్లో అత్యంత నాణ్యమైన కావల్సినంతా ఆయిల్స్ ఫ్యాట్స్ ఉంటాయి. అందుకే నట్స్ గుమ్మడి గింజలు, నువ్వులు, పొద్దుతిరుగుడు గింజలు తింటుండాలని సూచిస్తున్నారు. తాజా ఆకుకూరలు విభిన్నరకాల కూరగాయాలు, పండ్లుతినడం వల్ల యాంటి ఆక్సిడెంట్స్ ఎక్కువగా లభిస్తాయని చెబుతున్నారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

డాక్టర్ ఉమ్మగాని అరుణ్‌కుమార్
సైకాలజిస్టు, గైడెన్స్ అండ్ కౌన్సిలర్



పుస్తకాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి శ్రమిస్తే, మార్కుల సాధన సాధ్యమే. కష్టంగా ఉన్న సబ్జెక్టుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షల భయం పోవాలంటే వారికి వారే పరీక్ష పెట్టుకోవాలి. పరీక్ష హాలులో ఉన్నట్లు ఊహించుకోవాలి. చదివే సమయంలో ప్రతీ గంటకు ఒకసారి 5నిమిషాలు రిలాక్స్ కావాలి. 15 నిమిషాలైనా ప్రతిరోజూ ధ్యానం చేస్తే మంచి ఫలితాలు మీ సొంతం అవుతాయి.

కురవి ఆలయానికి జంబో ఫ్యాన్ బహూకరణ

కురవి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన వీరభద్ర ట్రావెల్స్ యాజమాని వెంకటేష్ రూ.1.60 లక్షల విలువైన జంబో ఫ్యాన్‌ను బహూకరించారు. ఈ ఫ్యాన్‌ను మహాశివరాత్రి ముందురోజు ఆలయంలో అమర్చారు.

కంఠమహేశ్వరునికి జలాభిషేకం

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనే గుండెపుడిలో గౌడ కులస్తులు శుక్రవారం ఘనంగా కంఠమహేశ్వర పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోపా సంఘం మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ మాట్లాడారు. భక్తిశ్రద్ధలతో గౌడ కులస్తులు కంఠమహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మలకు పంచామృతాలతో జలాభిషేకం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బోడపట్ల శ్రీనివాస్, లింగాల మహేందర్, లింగాల శ్రీకాంత్, వీరస్వామి, గుండాగాని ఉప్పలయ్య, బుచ్చిబాబు, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

మరిపెడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : యువత స్వయం ఉపాధి పథకాలను ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఆకాంక్షించారు. శుక్రవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో మల్సూర్ ఐరన్ అండ్ శానిటేషన్, సిమెంట్ ట్రేడర్స్‌ను ఏర్పాటు చేసుకోగా, ఆ షాపును నవీన్ ప్రారంభించి మాట్లాడారు. జర్పుల కాలునాయక్, అజ్మీరా హరి, ధరావత్ వెంకన్న, అల్వాల ఉపేందర్ పాల్గొన్నారు.

రాంపురం గంగమ్మ ఆలయానికి రూ.50 వేల విరాళం

మరిపెడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురం గ్రామ గంగమ్మ ఆలయ అభివృద్ధికి మరిపెడ ఆర్‌జేఆర్ఎం డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు రావుల రంజిత్‌రెడ్డి అక్కడి యాదవ కులపెద్దలకు శుక్రవారం రూ.50వేల విరాళం అందించారు. రంజిత్‌రెడ్డికి గంగమ్మ తల్లి ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉండాలని యాదవ కులస్తులు ఆకాంక్షించారు. మాజీ ఎంపీటీసీ కొమ్ము నరేశ్, మాడుగుల సోమన్న, కొమ్ము మల్లయ్య, వల్లపు లింగయ్య, ఉప్పలయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

గర్భిణులు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేయించుకోవాలి

మరిపెడ పీహెచ్‌సీ డాక్టర్ రవి

మరిపెడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు తమ పేర్లను మూడో నెలలోపు ఆయా గ్రామాల ఆరోగ్య కార్యకర్తల వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మరిపెడ పీహెచ్‌సీ డాక్టర్ రవి సూచించారు. శుక్రవారం ఆయన మరిపెడ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోగులకు వైద్య సేవలు అందించడంతో ఎండ తీవ్రతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్తు చేశారు. సూపర్‌వైజర్లు కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు, పద్మ, లక్ష్మి, పల్లె ఆస్పత్రుల సిబ్బంది అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీశ్, సాయిశ్రీ, తరణి, సరిత పాల్గొన్నారు.

పెంకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పెంకు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ టైల్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.మదార్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఏఎల్‌వో రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మదార్ మాట్లాడుతూ పెంకు కార్మికుల వేతన ఒప్పందానికై పరిశ్రమ యాజమానులు ముందుకు రాకపోవడంతో వారికి సమ్మె నోటీస్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. 2025 జనవరి 1 నుంచి పెంకుల నూతన వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా అందుకు యాజమానులు రావడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పెంకు పరిశ్రమ యాజమానులు స్పందించి, వారి వేతన ఒప్పందం ప్రకారం.. వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ నేతలు దుర్గాప్రసాద్, లింగ్యా, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

తొర్రూరు, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. శుక్రవారం వెలికట్టె, హరిజన కాలనీ, ఈదులకుంట తండా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలని సూచించారు. హెచ్ఎంలు మాధవి, ఉమారాణి, యాకయ్య, ఊర్మిళాదేవి, భాస్కర్ తదితరులు ఉన్నారు.